## స్థానిక ఆలయాల్లోనూ 'లడ్డూ'లు
### -విక్రయాలు ప్రారంభించిన టిటిడి



తిరుమల,సెప్టెంబర్ 3 ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలేశుని దర్శనం తరువాత భక్తులు పవిత్రంగా స్వీకరించే, తీసుకెళ్ళే "లడ్డూ"ప్రసాదాలు ఇకనుండి తిరుపతి పరిసరాల్లోని స్థానిక ఆలయాల్లో కూడా తిరుమల లడ్డూప్రసాదం విక్రయించాలని నిర్ణయించారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో రోజుకు 2వేల లడ్డూలు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో 5వేల లడ్డూలు, శ్రీనివాసమంగాపురం ఆలయంలో 5వేల లడ్డూలు, అప్పలాయగుంటలో 500 లడ్డూలు, నారాయణవనంలో 500 లడ్డూలు ఇలా నిర్దేశిత స్థానిక టిటిడి ఆలయాల్లో భక్తులకు 50రూపాయలకు ఒక లడ్డూ విక్రయించేలా చూస్తున్నారు. ఒక్కోభక్తునికి స్థానిక ఆలయల్లో 5లడ్డూలు విక్రయిస్తారు.






### సింగిల్‌విండో క్లియరెన్స్‌ద్వారా
## వినాయకచవితి పందిళ్లకు అనుమతి : ఎస్పీ



తిరుపతి,సెప్టెంబర్ 3ప్రభాతవార్త:
సమాజంలో ప్రతి ఒక్కరూ ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయకచవితి పర్వదినం పురస్కరించుకుని తిరుపతిలో ఉత్సవమండపాలు, పందిళ్ళు ఏర్పాటుచేసే ప్రజలకు సింగిల్‌విండో క్లియరెన్స్‌ద్వారా అనుమతినిస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గతంలో వినాయక మండపాలు కోసం అగ్నిమాపకశాఖ, పురపాలకశాఖ, విద్యుత్‌శాఖ, పోలీసు శాఖల నుండి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసి)తీసుకోవాల్సి ఉండేది. దీనికోసం ప్రజలు ఆయాశాఖల చుట్టూ అసౌకర్యంగా ఉండేది. రాష్ట్రప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ప్రతిష్టాత్మకంగా సింగిల్ విండో క్లియరెన్స్‌విధానం రూపొందించి, ప్రజలు "7995095800"నంబర్‌కు వాట్సాప్‌ద్వారా హై అనే సందేశం పంపితే చాలన్నారు. ప్రక్రియ మొత్తం మొబైల్‌కు సమాధానం వస్తుందన్నారు. ప్రజలు "హెచ్‌టిటిపిఎస్://గణేశ్‌ఉత్సవ్.నెట్"వెబ్‌సైట్‌లో గణేష్‌మండపం ఏర్పాటుచేయదలచిన కమిటీ సభ్యులు వివరాలు, మంటపం వివరాలు ,ఆటంకం లేకుండా ఏర్పాట్లు, పూజలు వంటివాటిపై అనుమతిస్తామన్నారు.

### కలెక్టర్ చొరవతో
## వి.కోటలో ప్రశాంతం

**నేడు కూడా 144 సెక్షన్ అమలు.. జిల్లా ఎస్పీ**
**- అల్లర్ల ఘటనలో పదిమందిపై కేసు నమోదు..**
**- భారీగా మోహరించిన పోలీసు బలగాలు !!**




వి.కోటలో పరిస్థితులు సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ , 144 సెక్షన్ అమలుతో బోసిపోయిన వి.కోట పట్టణం

వి.కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త
వి.కోట పట్టణంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న వివాదం సోమవారం అర్థరాత్రి వరకు కొనసాగింది. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠచందోలు అర్ధరాత్రి వరకు ఇరువర్గాల వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు. అల్లర్లకు కారకులైన వారిపై కేసు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇవ్వడంతో ఓ వర్గం వారు ఆందోళన విరమించారు. మంగళవారం తెల్లవారి ఆరుగంటలకల్లా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వి.కోటకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరో పక్క జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు బలగాలతో పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ వి.కోట మండలంలో మంగళ, బుధవారాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పట్టణంలోని దుకాణాలన్నీ మూతపడ్డాయి. ఇదిలా ఉండగా వి.కోటలో ఘర్షణలకు సంబంధించి పదిమందిపై వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు రెండు సామాజిక వర్గాల వారిని పిలిపించి శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. కార్యక్రమాల్లో కడ పి.డి. వికాస్ మర్మత్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.
వి.కోటలో చోటు చేసుకున్న వివాదం విచారకరమని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆయన వి.కోటకు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు చొరవ చూపి పరిస్థితి అదుపులో తీసుకువచ్చారన్నారు. ఘర్షణల్లో నష్టపోయిన వారికి సాయం అందేలా కృషి చేస్తామన్నారు. కాగా బిజెపి రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డి వి.కోటకు చేరుకుని పలువుర్ని పరామర్శించారు.

# బరితెగించిన ఇసుకాసురులు

**కౌండిన్య నది నుంచి యదేచ్ఛగా తరలిపోతున్న తెల్లబంగారం**
**పట్టించుకోని అధికారులు -కోట్లు గడిస్తున్న అక్రమార్కులు**



కౌండిన్య నదిలో జేసీబిలతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

గంగవరం,సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :
వంద రూపాయలకు నాలుగు కిలోల ఉల్లిగడ్డలంటూ నాలుగు చక్రాల బండిపై ఉల్లిగడ్డలు అమ్మినోడు వైసీపీ పార్టీలో ఇసుక దందాతో కోట్లకు పడగలెత్తాడు. నేడు అధికార తెలుగుదేశం పార్టీ ముసుగులో ఇసుక మాఫియా అవతారమెత్తి కోట్లు దండుకుంటున్నాడు.ఈ రెండు పార్టీలకు చెందిన ఇసుక మాఫియాకు జండాల రంగు వేరే కానీ,వ్యాపారం మాత్రం ఇసుక అక్రమ దందానే.అధికారాన్ని అడ్డు పెట్టుకుని మండలంలో ఎక్కడ చూసిన ఇసుక డంప్‌లను వ్యాపార అడ్డాలుగా పెట్టుకుని దందా కొనసాగిస్తున్నారు.గంగవరం మండలం అక్రమ ఇసుక రవాణాకు మూలకేంద్రంగా మారుతుంది.మండలంలోని కౌండిన్య నదిపై ఇసుక తోడేళ్ళ కన్ను పడింది.మండల పరిధిలో ఎటువంటి అనుమతులు కలిగిన ఇసుక రీచ్ లేకపోయినా ప్రతి రోజు పదుల సంఖ్యలో భారీ వాహనాల్లో ఇసుకను కొందరు అక్రమార్కులు సరిహద్దులు దాటిస్తున్నారు.ప్రభుత్వం మారినా మండలంలో ఇసుక దోపిడీ ఆగడం లేదు.ఇసుక దోపిడీలో రాటుదేలిపోయిన ఇసుకాసురులు యథేచ్ఛగా పాతపాటే పాడుతున్నారు.మామూళ్ళకు అలవాటుపడిన కొందరు అవినీతి అధికారులు అక్రమార్కుల చీకటి వ్యాపారానికి స్నేహహస్తం అందిస్తూనే ఉన్నారు.పట్టాభూముల్లో ఇసుక తవ్వకాల పేరుతో ఇసుక మాఫియా అరాచకం సృష్టించే దిశగా వేస్తున్న అడుగులు ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది.వివరాల్లోకి..అధికార పార్టీకి చెందిన కొందరు మండల స్థాయి నాయకులు తోడేళ్ళ అవతారమెత్తి మండలంలోని కౌండిన్య నదిలో,పరివాహక ప్రాంతాల్లోని ఇసుకపై కన్నేసి తోడేళ్ళులా అడ్డూ అదుపు లేకుండా రాత్రి పగలు అనే తేడా లేకుండా కౌండిన్య నది తమదే అన్నట్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.మండలంలోని గంగవరం,మేలుమాయి,తాళ్ళపల్లె, కలగటూరు,జీడిమాకులపల్లె, కల్లుపల్లె,దండపల్లె పంచాయతీ పరిధిలోని కౌండిన్య నదిలో ఇసుకను జేసీబిలతో తోడేస్తూ ట్రాక్టర్‌లకు నింపుకుని,టిప్పర్లకు నింపడానికి అనుకూలమైన ప్రదేశాల్లో పెద్ద పెద్ద రాసులుగా డంపింగ్ చేస్తున్నారు.పగలు ట్రాక్టర్లతో రవాణా చేసి డంప్ చేసుకున్న ఇసుకను రాత్రుల్లో టిప్పర్ల ద్వారా పుంగనూరు, మదనపల్లె సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాలకు తరలించి భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు.కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాల్లో ఇసుకకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఒక టిప్పర్ ఇసుక లోడ్ 40వేల నుంచి 70వేల వరకు అమ్ముకుని కోట్లకు పడగలెత్తుతున్నారు.ఇలా కౌండిన్య నదిలో ఇసుక కోసం 30 అడుగుల లోతు తవ్వకాలను చేపట్టి ఇసుకను బొక్కేస్తున్నారు.సంబంధిత అధికారులు మామూళ్ళు తీసుకుని అక్కడ ఏమి జరిగిన తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు.కౌండిన్య నది పరివాహక ప్రాంత రైతులు ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారు. కౌండిన్య నది వైపు వెళ్లాలంటేనే చుట్టు పక్కల రైతులు,ప్రజలు భయపడుతున్నారు. మండలంలోని ఏ గ్రామానికి వెళ్ళిన, సచివాలయాలు పక్కన ఎదురుగా, చేరువుల్లో,రహదారుల పక్కన ఎక్కడ చూసిన కొండలను తలపించే విధంగా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లే దర్శనమిస్తాయి.ఇంత బహిరంగంగా భారీ స్థాయిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న మండల,జిల్లా స్థాయి అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక అధికార పార్టీ నాయకులున్నారన్న భయమా..? లేక వారు ఇచ్చే ముడుపులకు దాసోహం అవుతున్నారా..? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.ఈ అక్రమ రవాణాపై స్థానిక పోలీసులకు,రెవెన్యూ అధికారులకు ఆధారలతో సహా సమాచారం అందించిన సంబంధిత అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహించి మరింత అక్రమ ఇసుక రవాణాకు ప్రోత్సహించినట్లు అధికారుల పనితీరు కనిపిస్తుందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## మధ్యాహ్న బడి భోజనం పౌష్టికాహారం నాణ్యతగా అందించాలి

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త
డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పిల్లలకు పౌష్టికాహారం నాణ్యతగా అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లాలోని పలు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం తయారు చేసే వంట ఏజెన్సీలు, కుక్స్, అక్షయపాత్ర, ఇస్కాన్, విద్యా శాఖ అధికారులు, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు కొంత మందితో కలిసి వర్క్ షాప్ నిర్వహించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలులో భాగంగా పిల్లలు మెచ్చి ఇష్టపడి తినేలా వారికి ఎంతో రుచికరంగా బలవర్ధకమైన ఆహారాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందించాలని సూచించారు. స్థానికంగా సీజనల్‌గా అందుబాటులో ఉండే కూరగాయలతో, ఆకు కూరలతో పిల్లలు ఇష్టపడి తినేటువంటి ప్రభుత్వ నిర్దేశిత మెనూ మేరకు వంటకాలు చేస్తే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డా.వి. శేఖర్, ఉప విద్యా శాఖ అధికారులు, అక్షయ పాత్ర ప్రతినిధులు, ఇస్కాన్ ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

### విజయవాడ వరదలకు
## టిడిపి ప్రభుత్వమే కారణం

**మాజీ మంత్రి ఆర్.కె.రోజా**



పుత్తూరు, సెప్లెంబరు 3 ప్రభాతవార్త :
విజయవాడలో వరద నష్టానికి, ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులకు అధికార తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణమని వైకాపాకు చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వరదల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు పడుతున్న బాధలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి వారికి పాలు, నీళ్ల అందడం లేదన్నారు. ఆగస్టు 30వ తేదీన భారీ వర్షాలు రానున్నాయని 28వ తేదీన ముందుగానే సమాచారం వున్నప్పటికీ ముఖ్యమంత్రి, మంత్రులు దీనిపై సమావేశాలు నిర్వహించి ముందస్తు చర్యలు తీసుకోవడంలో అలక్ష్యం వహించారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇంటికి మూడు కిలోమీటర్ల దూరంలోనే విపత్తు సంభవించినా ప్రజలకు కాపాడలేకపోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలమయ్యారన్నారు. కృష్ణా నది కరకట్టపై వున్న అక్రమ కట్టడాలు కాపాడడం కోసమే విజయవాడ ప్రజలను వరదల్లో ముంచెత్తారని ఆరోపించారు. గంట ముందు హెచ్చరించినా ప్రజలు ముంపు బారిన పడేవారు కాదని తెలిపారు వారంలో శుక్రవారం రాగానే చంద్రబాబుతో సహ మంత్రులంతా హైదరాబాద్ వెళిపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వయస్సు అయిపోయిందని, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అయిదు రోజులైన విజయవాడ ముఖం చూడలేదని, మంగళగిరి నియోజకవర్గం నుంచి గెలిచిన మంత్రి నారా లోకేష్ హైదరాబాద్‌లో ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. మునిసిపల్. ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విహార యాత్రలో వున్నారన్నారు. గతంలో విపత్తు సమయాల్లో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా జగన్మోహనరెడ్డి ఎప్పటికపుడు చర్యలు తీసుకునేవారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలు సేవలందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐపై వేటు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త
సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో 2021-23 సంవత్స రాల్లో ఎస్ఐగా పనిచేసిన పి.రవిబాబును సస్పెండ్ చేస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఒక కేసు విచారణలో అవకతవకలు, విధినిర్వ హణలో నిర్లక్ష్యం వంటి ఆరోపణలతో రవిబాబును సస్పెండ్ చేశారు. సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నప్పుడు 2023లో ఒక హత్యాయత్నం కేసులో నిర్లక్ష్యపు విచారణ చేసి కీలకమైన ప్రత్యక్ష సాక్షులను విచారించడంలో వైఫల్యం చెందడం, ఇద్దరు నిందితులను కేసును తప్పించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై ఎస్పీ సుబ్బారాయుడు విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే పై అధికారుల అనుమతులు లేకుండా అసలైన నిందితులను కేసు నుంచి తప్పించారనే ఆరోపణలు కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడయింది. హత్యాయత్నం జరిగిన ప్రదేశంలో కీలకమైన సాక్షాలను ఆర్ఎఫ్ఎస్ఎల్‌కు పంపకుండా నిర్లక్ష్యం చేశారని మరో ఆరోపణ కూడా ఎస్ఐ రవిబాబుపై మోపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

### కానిస్టేబుల్ సస్పెన్షన్

రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:
రేణిగుంటమండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌ను ఎస్పీ సుబ్బ రాయుడు సస్పెండ్ చేశారు. 2021లో గడువు పూర్తయిన తరువాత నకిలి ఆధార్‌కార్డు, పానకార్డు తయారు చేయించుకుని గురవరాజుపల్లి పంచాయతీలో నివాసం ఉంటున్న చైనాకు చెందిన వ్యక్తిపై రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి జైలుకు పంపారు. కానిస్టేబుల్ బాలాజీ అతని వద్ద రెండు లక్షల రూపాయలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా వాట్సాప్‌లో తెలుగుభాష లో అసభ్యకరంగా తిడుతూ వాయిస్ మెసేజ్‌లు పంపినట్లు రుజువు కావడంతో అతన్ని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు ఇచ్చారు.

## కాణిపాకం పూర్తికావస్తున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లు





కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 7 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లు శరవేగంగా సాగుతూ తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. దేవస్థానంలో ఈనెల 7 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం గత నెల నుండే ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి కేవలం మూడు రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఈఏర్పాట్లును శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ఆలయ కుంభాభిషేకం సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలంకరణ, తాత్కాలిక షెడ్లు, గణేష్‌దీక్ష మండపం ఏర్పాటు, రథం మరమ్మత్తులు వంటి పనులు పూర్తి కావస్తుండంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దాదాపు పూర్తవుతోంది. మిగిలిన చిన్న చిన్న ఏర్పాట్లును రెండు రోజుల్లోగా పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యుద్దీపాల కటౌట్‌లు, ఆర్చిల ఏర్పాటుకు రాత్రంబవళ్ళు కార్మికులు శ్రమిస్తున్నారు.అలాగే ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లుకు తుదిమెరుగులు దిద్దుతున్నారు.


**లోపలి పేజీల్లో**

ఆ రెండు రోజులు తిరుమలకు ద్విచక్రవాహనాలు నిషేధం

శివయ్య సన్నిధిలో తిరుపతి ఎస్‌పి


## పిళ్లారి పండుగకు సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు



పుత్తూరురూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:
వినాయక చవితి ఐదు రోజుల్లో రానుంది. వాడవాడలా ఆబాల గోపాలం ఆనందంగా నిర్వహించుకునే ఈ పండుగను రెండేళ్లుగా కరోనా మహమ్మారి వల్ల అసంతృప్తిగా చేసుకోవాల్సి వచ్చింది. గణేశుడి బొమ్మలు చేసి వాటి విక్రయాలపై ఆధారపడిన కార్మికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. ఈ ఏడాది కోవిడ్ ఆంక్షలు లేకపోవడంతో గణేష్ పండక్కి గండాలు తొలగినట్లయింది. ఈ ఏడాది ఉత్సాహంగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. పరిస్థితిలో మార్పు రావడంతో పండుగను భారీ నిర్వహించుకోవడానికి జనం సిద్ధమవుతున్నారు.






## ఉల్లి ఘాటు: వెల్లుల్లి ధరలతో కంట నీరు

### కిలో వెల్లుల్లి రూ.500లు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త
ఏ కూరలో అయినా ఉల్లిపాయలు,వెల్లులి లేనిదే రుచి రాదు. మహిళలు వంటలు వండరు. అయితే గత నెల రోజులుగా మార్కెట్‌లో ఉల్లి ధరలు ఘాటెక్కుతుండగా వెల్లుల్లి ధరలను వింటేనే కొనుగోలు దారులకు కంట నీరు వస్తుంది.ముస్లింలు నిర్వహించే శుభకార్యాల్లో భారీ ఎత్తున ఉల్లి,వెల్లులి వాడతారు. అయితే ధరలు దడ పుట్టిస్తుండటంతో వారు కూడా వెజిటేరియన్‌కు అలవాటు పడుతున్నారు. మార్కెట్‌లో మాంసం ధర కిలో రూ.900లకు చేరుకుంది. దాంతో విందుల్లో నాన్ వెజిటేరియన్‌కు స్వస్తి చెబుతున్నారు. అయితే మార్కెట్‌లో ఆదివారం అందిన సమాచారం మేరకు కిలో ఉల్లిపాయులు( ఎర్రగడ్డలు) రూ.60లకు చేరుకుంది. ఇక వెల్లుల్లి (తెల్లగడ్డలు)కిలో రూ.500లు తాకింది. రెండు నెలల క్రితం కిలో వెల్లుల్లి రూ.150 నుంచి 200లు పలుకుతుండగా ఒక్కసారిగా వెల్లుల్లి ధరల కిలో రూ.500లకు పెరిగి వినియోగదారులు,కొనుగోలు దారులకు కంట నీరు తెప్పిస్తుంది. ఒక వంద గ్రాములు వెల్లుల్లి రూ.50 అంటే అబ్బో అంటూ నిట్టూరుస్తున్నారు.రెండు నెలల క్రితం వరకు టమోటాల ధరలు దడపుట్టించగా నేడు ఉల్లి, వెల్లులి కంటనీరు తెప్పిస్తుంది. దాంతో క్యాటరింగ్ నిర్వాహకులు కూడా తమ ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ధరలు పెంచుతున్నారు.
ఫోటో -ఎస్‌కెహెచ్‌టి-6

## నారాయణ పాఠశాలలో ఈ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం.



**తిరుపతి విద్య సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** స్థానిక మంగళం లోని నారాయణ పాఠశాలలో ఈ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఇంజనీర్ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ కృష్ణ మూర్తి హాజరై ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మేనేజ్మెంట్ రికవరీ లేదా పారవేయడం ద్వారా పునరద్దురణ,పునర్వినౌయోగం,పున:విక్రయం సాల్వ్,రీసైక్లింగ్ గురించి వివరించారు. అనంతరం ఏజీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైకిలింగ్ వల్ల ఉత్పన్నమయ్యే పర్యావరణ ప్రమాదాలను అరికట్టడానికి గల మార్గాలను వివరించారు. ఆర్ ఐ వసంత కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల పాదముద్రను తగ్గించడానికి సులభమైన పద్దతులను దనాకి కృషి చేసే వారిని ప్రోత్స హించారు. విద్యార్థులందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హంసవేణి, అకడమిక్ డీన్ వెంకటేష్, ఆర్ ఎస్ టి డిపార్ట్మెంట్ సాయికృష్ణ, ఎస్ ఎస్ టి నవాజ్, ఏఓ మునికుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిఐ రామయ్యకు ఘన సన్మానం

### తిరుపతి ఎస్వీయు పోలీస్ స్టేషన్‌కు బదిలీ



**చంద్రగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో సిఐ రామయ్యను మంగళవారం ఎస్ఐ రవీంద్రనాథ్, ఎస్ఐ అనిత, ఏఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘన సన్మానించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా చంద్రగిరికి బదిలీపై వచ్చిన సిఐ రామయ్య ప్రస్తుత బదిలీలలో ఇక్కడికి నుండి తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సిఐ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు చంద్రగిరి పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికల వేళ అనేక వత్తిడులను ఎదుర్కొం టూనే విధి నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను పూర్తి చేయ డంలో విజయవంతమయ్యారు. ఎన్నికల విధులలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞ తలు తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో నారాయణవనం ఎస్సీ హాస్టల్‌కు

### రూ.10.90 లక్షలు మంజూరు



**పిచ్చాటూరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి మేరకు నారాయణవనం ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ మరమ్మతులకు జిల్లా కలెక్టర్ రూ.10.90 లక్షలు మంజూరు చేశారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్యను ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా డీడీ చెన్నయ్య నారాయణవనం ఎస్సీ హాస్టల్‌కు రూ.10.90 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. గత వారం ఎమ్మెల్యే ఆదిమూలం, సంక్షేమశాఖ డీడీతో కలసి నారాయణవనం ఎస్సీ హాస్టల్‌ని ఆకస్మిక తనిఖీ చేసి సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు సదరు హాస్టల్ మరమ్మతులకు రూ.10.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే నియోజకవర్గంలోని మిగిలిన సంక్షేమ హాస్టళ్ళ మరమ్మతుకు కూడా త్వరలో నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలను తహసీల్దార్ తనిఖీ

**పిచ్చాటూరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణం జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం మధ్యాహ్నం భోజనాన్ని తహసీ ల్దార్ రమేష్‌బాబు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యా ర్థులకు వడ్డించే రుచి చూసి ప్రాధాన్యత నివ్వాలని వంట నిర్వాహకులకు సూచించారు. పది మందికి అన్నం పెట్టడం, మీరు పూర్వజన్మ చేసుకున్న పుణ్యం, అలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులతో శభాష్ అనిపించు కోవాలని తెలిపారు. తరచూ వచ్చి తనిఖీ చేసి రుచి చూస్తానని ఆదేశించారు. అనంతరం టీచర్స్ కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం చిన్నారులకు, బాలింతలకు, తల్లులకు పొరపాటున కూడా తప్పిపోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు అముద, సఫియా, తదితరులు పాల్గొన్నారు.

## ఏఈల నియామకాలు చేపట్టాలి

### -విద్యుత్‌శాఖ ఇంజనీర్స్ అసోసియేషన్

**తిరుపతి, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యుత్‌సంస్థలో అసిస్టెంట్ ఇంజనీర్ల నియామకాలను చేపట్టాలని ఏపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్రఇంధనశాఖమంత్రి ఓఎస్‌డి సాంబశివరావు తిరుపతికి విచ్చేయడంతో మంగళవారం ఆయనను ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉయ్యాల రమేష్‌బాబు, కార్యదర్శి పుల్లా బాలాజీ మాట్లాడుతూ గత పే రివిజన్‌లో ఇంజనీర్లకు అన్యాయం జరిగిందని వివరించారు. భవిష్యత్తులో జరిగే పేరివిజన్‌లో ఈ తరహాల అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏఈల నియామకాలు చేపట్టకపోవడంతో ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంజనీర్ల పదోన్నతుల్లో జాప్యాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలుచేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిడిసిఎల్ సిజిఎం పి.అయూబ ఖాన్(ప్రాజెక్ట్స్), ఇఇ పి.రవికుమార్, అసోసియేషన్ నాయకులు కె.జయప్రకాష్, డి.భాస్కర్‌నాయుడు, కె.స్వాతి, కె.మునిప్రసాద్, టి.వెంకటలక్ష్మి, జి.రమేష్, సి.బాలాజీ ,రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదిమూలంపై ఆరోపణలు అవాస్తవం



**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** కేవిబిపురం మండలం రాయపాడు గ్రామంలో 1962 నుండి సౌత్ రూథర్ సంఘంకు చెందిన 20 సెంట్లు చర్చి ఆలయాన్ని సత్యవేడు శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం అనుచరులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆరోపణలు చేసిన ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు మావిళ్ళయ్య కుటుంబ సభ్యులతో కలిసి చేసిన ఆరోపణలు అవాస్తవాలని రాయపేడు గ్రామస్తులు ఎంపిపి సుబ్రమణ్యం, బంధువులు శివలింగ, అశోక్, దొరసాని, ఏలుమలై, జనసేన నాయకులు సురేష్ రెడ్డి, చర్చి పాస్టర్ చటర్జీలతో కలిసి డాక్టర్ రమేష్ స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా ముందు మావిళ్ళయ్య చేసిన ఆరోపణలలో వాస్తవాలు లేవన్నారు. చర్చి స్థల వివాదం కోర్టులో జరుగుతుందని ఏదన్నా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని తెలిపారు.

## వరదల్లో బురద రాజకీయాలు మానుకో జగన్



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఐదేళ్ళ పాలనాకాలంలో విపత్కర పరిస్థితుల్లో బాధితుల సహాయార్థం తాడేపల్లి ప్యాలెస్ దాటి ఏనాడూ బయటకు రాని జగన్‌రెడ్డి నేడు విజయవాడ వరదల విషయంలో చేస్తున్న బురద రాజకీయాలు మానుకోవాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు విమర్శించారు. అధికారంలో ఉన్నాన్నాళ్ళు ప్యాలెస్‌లో కూర్చొవడం తప్ప బయటకు వెళ్ళాలంటే పచ్చనిచెట్లు నరకడం, కొద్దిపాటి దూరానికి కూడా పరదాల మాటున ప్రయాణించడం విపత్తులు సంభవించినపుడు విహంగ వీక్షణం చేయడం తప్ప ఐదేళ్ళ పాలనలో ఏనాడు బయటకి రాని జగన్ నేడు వరదబాధితులను పరామర్శించడం సిగ్గుచేటన్నారు. జగన్ హయాంలో కూడా వరదలు వచ్చినపుడు కనీసం పంటలు కూడా పరిశీలించలేదని గుర్తుచేసుకోవాలన్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అతిభారీగా వర్షాలకు మున్నేరు, బుడమేరు వంటి వాటికి చరిత్రలో ఎన్నడూ లేనంతంగా వచ్చిన వరద ప్రవాహంతో అతలాకుతలమయిన ప్రజలకు అండగా నిలబడి రేయింబవళ్ళు సహాయక చర్యల్లో అవిశ్రాంతంగా పనిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై వైసిపి నాయకులు చేస్తున్న చౌకబారు విమర్శలు వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. విజయవాడ నగరంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల్లో బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న వారిని ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా మాట్లాడుతున్న మాజీ మంత్రి, సినీనటి రోజా వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసి విభాగం నాయకులు మిన్నల్‌రవి, డా.యం.ఉమేష్‌రావు, నెమళ్ళూరుబుజ్జి, కోటచంద్రశేఖర్, సునీల్, శివ, చాంద్‌భాష, సులేమాన్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా బొజ్జలసుధీర్‌రెడ్డి పాలన



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా సాగుతున్న ఎంఎ ల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ అ న్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో జరిగిన కుటుంబ పాలన, భూదందాలు, ఇసుకదోపిడీ, గుడి దోపిడీలకు చోటులేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్డీయే కూటమి నాయకులతో పాటు మీడియా ప్రతినిధుల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి 100రోజులు గడవక ముందే శ్రీకాళహస్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ఎంఎల్ఏ వెంకటసుధీర్‌రెడ్డి అవినీతికి, అక్రమాలకు, ల్యాండ్, మైన్స్ దోపిడీలకు అడ్డుకట్ట వేస్తూ మచ్చలేని అభివృద్ధి చేస్తున్నారన్నారు. పట్టణ అమృత పథకం ద్వారా రూ.24కోట్లుతో టెండర్లు పిలిచారని మరియు రూ.115కోట్లుతో నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధికోసం కేంద్ర మంత్రితో కలసి మంజూరు చేయించిన ఘనత బొజ్జలసుధీర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర సభ్యులు ఎస్వీరమణ, జివిఅమర్నాధ్, పట్టణ ఓబిసి మోర్చా అధ్యక్షులు కన్నావెంకటేశ్వర్లు, కందాటి మునిరాజ, ముప్పాలకుమార్‌నాయుడు, చెంగల్రాయులురెడ్డి, భరత్‌కుమార్‌నాయుడు, రవీంద్ర, రమేష్‌యాదవ్, కుమార్, కృష్ణారెడ్డి, మోహన్, సింగమాలకుమార్, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ ఎస్పీని కలసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ



**రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** తిరుపతి అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అందరికి సుపరిచితులైన రవి మనోహరాచారిని తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు సీఐ మధుసూదన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. రైల్వే ప్రొటెక్షన్ వ్యవస్థకు సహకరించాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

## మాధవమాలలో కొయ్య బొమ్మల బౌగోలిక గుర్తింపునకు అధ్యయన బృందం



**ఏర్పేడు, సెప్టంబరు3, ప్రభాతవార్త;** మండలంలోని మాధవమాల గ్రామంలో చేతివృత్తుల వారు తయారు చేస్తున్న కొయ్య బొమ్మలకు బౌగోలిక గుర్తింపునకు గ్రామం లోని బాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థను జిఐ అధికారులు శుభజిత్ సాహ, శ్రీవాస్తవ లు మంగళవారం సందర్శించి అధ్యయనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాధవమాల గ్రామంలో కళాకారులు తయారు చేస్తున్న కొయ్య బొమ్మలను దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందడానికి, తయారు చేసిన బొమ్మలను మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరలకు అమ్ముకునేందుకు జిఐ దోహదపడుతుందని తెలిపారు. అలాగే టూరిజం కూడా మెరుగుపడుతుందని దాని ద్వారా అనేక మంది యాత్రికులు, టూరిస్టులు నేరుగా వచ్చి కొయ్య బొమ్మలు కొనడానికి దోహదపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు గుర్తింపు పొందినవి 18 మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు మాధవమాల గ్రామానికి జిఐ గుర్తింపును తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు చేయడానికి ఇక్కడికి రావడం జరిగిందని వారు తెలిపారు. ఇక్కడి కళాకారుల తయారు చేస్తున్న కొయ్య బొమ్మలను గురించి క్షుణ్ణంగా పరిశీలన చేసి జిఐ కి సిపారసుచేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో బాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థ ప్రమోటర్ కృష్ణ మూర్తి, సంస్థ అధ్యక్షులు లోకనధం అచ్చారి, కార్యదర్శి రాజాచ్చారి, పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణకు గురైంది..రక్షించండి

### జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు



**ఏర్పేడు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** మండలంలోని మడిబాక గ్రామానికి చెందిన చెరువును కొందరు ఆక్రమణ దారులు ఆక్రమించి ఉన్నారని మడిబాక మాజీ సర్పంచి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రాయపనేని మల్లిఖార్జున్ నాయుడు మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువును సర్వే చేయించి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు.

## తహసిల్దార్‌ని సన్మానించిన టిడిపి నాయకులు



**ఏర్పేడు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** ఏర్పడు మండల తహసిల్దార్ ఎం భార్గవిని మంగళవారం మడిబాక మాజీ సర్పంచి రవి నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నేరుగా స్వీకరించి పరిష్కరిస్తున్నందుకు అభినంధించి ధన్యవాదాలు తెలియ జేశారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలు తమ పిర్యాధులను నేరుగా తన దృష్టికి తీసుకొచ్చినట్లైతే వెంటనే పరిష్కరించగలనని తహసిల్దార్ భార్గవి తెలిపారు. ఈకార్యక్రమంలో మాఈ వైస్ ఎంపిపి మురగయ్య, కేశనేనిసుబ్రమణ్యం, కందాడ నరేంద్ర తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహణపై అధికారులతో సమావేశం



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** ఇంటింటి సర్వే నిర్వహణ పై మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లతో తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎన్. మౌర్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ జాబితా కోసం ఇంటింటి సర్వే నిర్వహిసున్నామని అన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి సంవత్సరం ఈ సమ్మరీ రివిషన్ నిర్వహిస్తామని అన్నారు. ఓటర్ల ఇంటింటి సరేవ్వకు 18 రోజులు సమయం ఉందన్నారు. మీరందరూ సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికి వెళ్లి ఎవరైనా మరణించారా? ఇల్లు మారారా? అడ్రస్సు మార్పులు ఏమైనా ఉన్నాయా? అని వివరాలు సేకరించాలని అన్నారు. కొత్త ఓటు నమోదు చేసుకునే వారికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని, కొత్త ఓటర్ నమోదు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

## విద్యార్థినులందరూ హస్తకళా నైపుణ్యాభివృద్దిని సాధించాలి

### ప్రిన్సిపాల్ నారాయణమ్మ



**తిరుపతి విద్య సెప్టెంబర్ 3 ,ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల లోని హోం సైన్స్ విభాగం వారు సంప్రదాయ హస్తకళల ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు .హస్తకళ ప్రదర్శనకు సంబంధించి విద్యార్థినులు సంప్రదాయ కళలైన ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, క్లే కర్క్, పేస్టల్ ఆర్ట్, డైయింగ్, లిప్పాన్ ఆర్ట్, టౌన్ జోర్ పెయింటింగ్, కళంకారీ రంగులను ఉపయోగించి వివిధ రకాల వస్తువల్ని తయారు చేశారు. ఈ ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ సందర్శించి విద్యార్థినులందరూ అద్భుతంగా హస్తకళలను తయారు చేశారని కొనియాడారు. విద్యార్థినులలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, వారికి కళల పట్ల అవగాహన కల్పించి, వస్తువుల్ని తయారు చేయడానికి ప్రోత్సహించిన అధ్యాపకుల్ని అభినందించారు. విద్యార్థినులందరూ బాగా కృషిచేసి హస్తకళా నైపుణ్యాభివృద్ధిని సాధించాలన్నారు. విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను సేల్స్ కు పెడితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మి, వార్డెన్ హేమలత, అటానమస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె ఉమారాణి, డిప్యూటీ వార్డెన్ సాయికుమారి, హోమ్ సైన్స్ విభాగపు అధ్యాపకులు డాక్టర్‌శ్రీవాణి, డాక్టర్‌నాగమణి, డాక్టర్ చెంచులక్ష్మి, డాక్టర్ ఉమారాణి, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి పొందాలి..ఆర్డీవో



**తొట్టంబేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు మండపాలు ఏర్పాటు, విగ్రహం పట్టడంపై ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మండపాలు ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించే చోట పోలీసు అధికారులు, విద్యుత్‌శాఖ, అగ్నిమాపకశాఖ అధికారులుతో చర్చించారు. చవితి మండపాలు ఏర్పాట్లు, విగ్రహాల ఎత్తు, నిమజ్జనం తదితర ఏర్పాట్లపై జాగ్రత్తలు విద్యుత్ సౌకర్యం కల్పన అంశాలపై చర్చించారు. విద్యుత్ కనెక్షన్‌కోసం విద్యుత్ అధికారులు అనుమతులు తీసుకోవాలని, ఏర్పాటు చేసే ప్రాంతాల్లో అధికంగా పాటలు పెట్టరాదని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. పండుగను ఆహ్లాదకర వాతావరణంలో చేసుకోవాలన్నారు. పండుగలు సాంప్రదాయాలని తెలిపారు. ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు కమిటీలదే బాధ్యత అని ఏవైనా అవాంచనీయ సంఘటనలు జరిగే వారిదే బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో అర్బన్ సిఐ గోపి, టుటౌన్‌సిఐ వెంకటేశులు, విద్యుత్‌శాఖాధికారులు, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక సేవామూర్తులకు సత్కారం



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** పట్టణంలోని నాగమల్లికృష్ణమూర్తి పౌండేషన్ ఆధ్వర్యంలో నాగమల్లి కృష్ణమూర్తి 10వ వర్ధంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమంలో పునీతులైన ప్రముఖులను మంగళవారం తెలుగుగంగ కాలనీలోని సరస్వతీబాయి పురపాలక సంఘ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిద్దులుగారిజయబాబు విచ్చేశారు. సన్మాన గ్రహీతలుగా అమ్మ ఆశ్రమ నిర్వాహకురాలు పి.భూలక్ష్మి, కవి మరియు చిత్రకారులు కె.దామోదరాచారి, నవభారత్ యువజన సంఘం కార్యదర్శి మరియు బిజెపి పట్టణ అధ్యక్షులు గరికపాటిరమేష్‌బాబు, , పౌర సంక్షేమ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కోలా.వెంకటేశ్వరరావు, గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్, జైన్ సంఘం ధర్మిచంద్ అశోక్ కుమార్, పిళ్ళారి పౌండేషన్ నిర్వాహకురాలు అమరావతి, యువతరం సేవా సమితి గోపి తదితరులను దుశ్శాలువతో సత్కరించి మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అంజూరు చక్రధర్, అంజూరు దినకర్, మైనంపాటి చలపతి, గోపాలకృష్ణ, సునీల్, లోకనాధం, ఆర్ఎంపి డాక్టర్ దినేష్‌రూన్సీ, సునీత, మునిభూషణ, పద్మజ, శ్రీనివాసులు, మల్లికార్జున, రమేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగమల్లిరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై సర్వే జరపాలి - వెంకటాద్రి యాదవ్

**రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం వెంకటాద్రి పంచాయతీలో ఆక్రమణలు జరుగుతున్నాయని బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్ ఆరోపించారు. పంచాయతీలో వెంకటాపురం చెరువుకు నీరు వచ్చే ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కూడాఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. తక్షణం తహసీల్దారన స్పందించి సర్వే జరపాలని విజ్ఞప్తి చేశారు.

# తిరుపతి డివిజన్

## భక్తిశ్రద్ధలతో ముగిసిన శ్రీకృష్ణ జయంతి వేడుకలు



**పుత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వం స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు మంగళవారంతో ముగిసింది. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే స్వామివారిని ప్రత్యేక పుష్పాలు అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గోపూజ, తోట ఉత్సవం, వసంతోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. అనంతరం గీతా మందిరం వారు భక్తులకు ప్రసాదాలు అందించారు.

## శాంతినగర్ శ్మశాన స్థలం కబ్జా అరికట్టాలి



**పుత్తూరు, సెప్టంబరు 3 ప్రభాతవార్త :** మునిసిపాలిటీలోని 21వ వార్డు పరిధి చెర్లోపల్లి ఆది ఆంధ్రవాడ శాంతినగర్‌లో శ్మశానాన్ని కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలుగా స్థానికులు శ్మశానంగా వినియోగిస్తున్న స్థలంపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి స్వలాభం కోసం రోడ్డు వేయడం సరి కాదన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషనర్ సిఫారసుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ కాలనీల శ్మశానాలకు రెండు ఎకరాలు కేటాయించాలని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా నుంచి శ్మశాన స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించగా, శ్మశాన స్థలాన్ని సర్వే చేసి ఆదిఆంధ్రవాడకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగభూషణం, మాతయ్య, వెంకటేష్, బి.హరి, పి.సుధ తదితరులు పాల్గొన్నారు.

## చెర్లోపల్లి ఆది ఆంధ్రవాడ శ్మశానం కబ్జాను అరికట్టాలి - సీపీఎం ధర్నా

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపాలిటీ 21వ వార్డు చెర్లోపల్లి ఆది ఆంధ్రవాడ శాంతినగర్‌లో శ్మశానం కబ్జాపై రియల్ ఎస్టేట్‌లో వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చెర్లోపల్లి గ్రామస్తుల పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు వందల సంవత్సరాలుగా చెర్లోపల్లి ఆది ఆంధ్రవాడ తూర్పు భాగంలో ఏర్పాటుచేసుకుని ఆ గ్రామంలో మృతి చెందిన వారిని ఆ శ్మశానంలో అంత్యక్రియలు చేసేవారు. ఇప్పుడు ఆ శ్మశానాన్ని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి లాభాల కోసం ఆ శ్మశానంపైన రోడ్డు వేయడం సరైన పద్ధతి కాదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెర్లోపల్లి ఆది ఆంధ్రవాడకు శ్మశానం రికార్డులు ఎక్కించి హద్దులు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాల అరికట్టి ఆ శ్మశానాన్ని కాపాడి వారికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వరులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, గ్రామస్తులు నాగభూషణం, మాతయ్య, పి.వెంకటేష్, హరి, సుధ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో చదువుకో ఉన్నత స్థాయికి ఎదుగు..



**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుంచి పట్టుదలతో విద్యాభ్యాసన కోసం చదువుకుంటే ఆశయ సాధన లభిస్తుందని ఉన్నత స్థాయికి ఎదగలమని, వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్ఐ విశ్వనాథ నాయుడు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని పల్లమాల ఉన్నత పాఠశాల విద్యార్థులతో పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం, మహిళలపై అఘాయిత్యాలు నివారిద్దాం, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండడం, ట్రాఫిక్ రూల్స్ పాటించడం గురించి విషయాలపై అవగాహన కల్పించి, ప్రతి విద్యార్థి తమవంతు బాధ్యతగా సమాజ శ్రేయస్సు దృష్ట్యా వారి తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులకు అవగాహన కల్పించి వారిచే ప్రతిజ్ఞ చేయించి తమవంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడి ఇష్టంతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో పలమాల హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏకలవ్య గురుకుల పాఠశాలను తహసీల్దార్ తనిఖీ



**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఏకలవ్య గురుకుల పాఠశాలను తహసీల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజన వసతి కోసం వినియోగించే బియ్యం, పప్పు ధాన్యాలు పలు వస్తువులను, సరకులు స్టోర్ గదిలోపరిశీలించారు. అనంతరం నీటి సౌకర్యం, వసతి భవనాలు, పరిశుభ్రత, మరుగుదొడ్లు పరిశుభ్రత పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఆహారం పరిశీలించి తరగతి గదుల్లో విద్యార్థులతో విద్యబోధన, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన మంచి రుచికరమైన భోజనం అందించాలని సకాలంలో విద్యాబోధనకు సంబంధించి సిలబస్సు పూర్తి చేయాలని ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయులకు ఆదేశించారు. వీరితో పాటు మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీజన్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి - వైద్యాధికారి దివాకర్



**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** వర్షాలు పడుతుండడంతో ప్రజలు సీజన్ జ్వరాలలు బారిన పడకుండా చర్యలు చేపట్టి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారి దివాకర్ సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో సీజనల్ జ్వరాలపై పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దివాకర్ మాట్లాడుతూ ప్రతివైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు వారికి నియమించబడిన ప్రాంతాల్లో సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. గర్భవతులను గుర్తించి 12 వారాల్లోపు నమోదు చేయాలని, గర్భవతులకు అందించవలసిన సేవలు సకాలంలో అందించి, ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరిగేలా చూడాలన్నారు. మొదటి కాన్పు, రెండో కాన్పులో ఆడ శిశు జన్మిస్తే వారికి పీఎం ఎంవీవై పథకం వర్తించేలా చూడాలన్నారు. మచ్చలు సోకిన వారిని గుర్తించి డా. అనుమతితో వైద్యపరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి డి.ఎస్.వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

## రేణిగుంట పంచాయతీకి కార్యదర్శి కొరత

### కార్యదర్శి ఎప్పటికి వస్తాడో...అంతా మిథ్య..!



**రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రేణిగుంట మేజర్ పంచాయతీకి దాదాపు మూడు నెలలుగా శాశ్వత కార్యదర్శి లేకపోవడంతో పంచాయతీలో పనులు పడకేశాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తూతూ మంత్రంగా గ్రామ సభలు, ఒక్క అత్యవసర సర్వసభ్య సమావేశం తప్ప పంచాయతీ సర్వసభ్య సమావేశాలు(సాధారణ సమావేశాలు) వాయిదాలు పడుతూనే ఉన్నాయి. ఇన్‌చార్జి కార్యదర్శులు రేణిగుంట పంచాయతీ మా కొద్దు మహా ప్రభో అంటూ దండం పెట్టి పారిపోతున్నారని విమర్శలు లేకపోలేదు. ఇలా ఎందుకు జరుగుతుందో లో గుట్టు పెరుమాళ్ళకేరుకు..! జనాభా ఉన్నారు. శాశ్వత కార్యదర్శి లేకపోవడం వల్ల పారిశుధ్య పనుల మొదలు అభివృద్ధి పనుల వరకు ముందుకు సాగడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీకి లాభం చేకూర్చే వేలం పాటలు జరగలేదు. దీంతో పంచాయతీకి వచ్చే ఆదాయానికి గండిపడుతోంది. రేణిగుంట పంచాయతీలో అధికార పార్టీ నాయకుల తీరు ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన ఉంది. అందు వల్లే అభివృద్ధి కుంటు పడుతోందని, పార్టీకి చెడ్డ పేరు వస్తుందన్నదని టీడీపీ అభిమానులు కొంత మంది బాధను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తక్షణం స్పందించి శాశ్వత కార్యదర్శిని నియమించి పంచాయతీని గాడిలో పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం..సిడిపిఓ



**.తొట్టంబేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త** పౌష్టికాహారం తోనే చిన్నారులు, గర్భిణీస్త్రీలు, బాలిం తలు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటా రని సిడిపిఓ శాంతి దుర్గ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పౌష్టికాహార మహోత్సవా నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీచేసే పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలకు రక్తహీనత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారుల బరువు తగ్గకుండా చూడాలన్నారు. అంతేకాకుండా మతాశిశుమరణాలను తగ్గించేందుకు చర్యలుతీసుకోవాలని సూచించారు. గర్భవతులుగా ఉన్న సమయంలో వైద్యుల సూచనలు పాటిస్తూ సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త సురేఖ, మునిలక్ష్మి, కౌసల్య, అర్చన, అంగన్‌వాడీ సహాయకురాలు జయమ్మ పాల్గొన్నారు.

